పోలింగ్ సిబ్బందికి తప్పని ఇబ్బంది

జేఎన్‌టీయూలో సౌకర్యాలు కరువు



జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ శిక్షణ శిబిరాన్ని తనిఖీ చేసిన అధికారులు, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొన్న సిబ్బంది



కూకట్‌పల్లి: జేఎన్‌టీయూలో ఇతర పోలింగ్ స్టేషన్స్ అధికారుల శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ శిబిరంలో విద్యుత్ లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోలేదు. ఈ శిబిరంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను శనివారం అధికారులు నిర్వహించారు. ఉదయం 10 నుంచి ఈ శిక్షణ కేంద్రంలో వచ్చిన ఎన్నికల సిబ్బందికి ఎటువంటి నీటి సౌకర్యం కానీ, టీ, టిఫిన్స్ ఏర్పాటు చేయకపోవటంతో ఇబ్బందులు పడ్డారు. ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఇబ్బందులును గుర్తించిన కుత్బుల్లాపూర్ ఎన్నికల పరిశీలకులు కూకట్‌పల్లి ఎన్నికల అధికారి శ్యాంప్రకాష్‌కు కనీస సౌకర్యాలు అందజేయాలని తెలిపారు.

గాజు గ్లాసుకు ఓటేసి గెలిపించాలి

కూకట్‌పల్లి జనసేన అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్



కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న జనసేన, బీజేపీ నాయకులు



కూకట్‌పల్లి: బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ శనివారం కేపీహెచ్‌బీ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీల పార్కు, రమ్యా గ్రౌండ్స్, కేపీహెచ్‌బీ 3వ ఫేజ్ వరకు పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ మాట్లాడుతూ.. కేపీహెచ్‌బీ డివిజన్ ప్రాంత ప్రజలు ఎక్కువగా చైతన్యవంతులు, విద్యావంతులన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో గెలుపు ఈసారి యువతీ, యువకుల మీద ఆధారపడి ఉందన్నారు. యువత మేల్కొని ఎన్నికల్లో అందరూ విజ్ఞతతో ఆలోచించి క్రమ సంఖ్య 7 గాజుగ్లాసు గుర్తు మీద ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గెలిచిన తర్వాత ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలన్నిటిని పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు గంధం రాజు, కొల్లా శంకర్, ప్రసాద్, డివిజన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ముమ్మారెడ్డికి మద్దతుగా కాంతారావు ప్రచారం

కూకట్‌పల్లి: ప్రజలు ఓటు ద్వారా బీఆర్‌ఎస్ పార్టీకి నవంబర్ 30న వీఆర్‌ఎస్ ఇస్తారని బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు పేర్కొన్నారు. బీజేపీ బలపర్చిన కూకట్‌పల్లి అసెంబ్లీ జనసేన పార్టీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌కు మద్దతుగా శనివారం వివేక్‌నగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ అవినీతి, కుటుంబ, నియంతృత్వ పాలన కొనసాగదని, నిరుద్యోగ యువకుల జీవితాలను ఆగం చేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించటమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని అన్నారు.

ఖజౌలి ఎమ్మెల్యేతో మాధవరం కాంతారావు భేటీ...

తెలంగాణ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా బీజేపీ నాయకులు కార్యకర్తలు కృషి చేస్తున్నారని వారికి తోడుగా ఢిల్లీ బీజేపీ అధిష్టానం సైతం అండగా ఉంటూ దిశానిర్దేశం చేస్తోందని మాధవరం కాంతారావు పేర్కొన్నారు. కూకట్‌పల్లి అసెంబ్లీ ఎన్నికల పర్యవేక్షకులుగా విచ్చేసిన ఖజౌలి అసెంబ్లీ నియోజకవర్గ శాసనసభ్యులు అరుణ్ శంకర్ ప్రసాద్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు అనుసరించిన ఎన్నికల ప్రచారం కార్యక్రమాలు, ఓటర్ల నాడి, బూత్‌స్థాయి పని విభజన వంటి కీలక విషయాలను వివరించారు. ఆదివారం కూకట్‌పల్లిలో నిర్వహించనున్న విజయ సంకల్ప సభను విజయవంతం చేసేందుకు అమలు చేయాల్సిన కార్యాచరణ, జన సమీకరణ వంటి కీకల అంశాలపై చర్చించారు.

బ్యాడ్మింటన్‌లో రాజ్‌కుమార్ ప్రతిభ



రాజ్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డా. అలివేలు మంగమ్మ

మూసాపేట: ఉస్మానియా విద్యాలయం వారు స్పోర్ట్స్ డే ఇంటర్ కాంపిటీషన్స్ నిర్వహించారు. బ్యాడ్మింటన్ సింగిల్‌లో కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న పి.రాజ్‌కుమార్‌కు మొదటి బహుమతి దక్కించున్నాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. అలివేలు మంగమ్మ విద్యార్థినిని అభినందించారు. ఈ విద్యార్థినిని స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన విద్యార్థులు కూడా వివిధ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.బి.భవాని, అధ్యాపకులు డా.సాలయ్య, డా.శ్రీనివాస్, డా.శారద, రజిత, ఖాదిరున్నీసాలు విద్యార్థికి అభినందనలు తెలిపారు.

మెడికల్ షాపుల మద్దతు మాధవరం కృష్ణారావుకే...

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మెడికల్ షాపు అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. 30వ తేది జరిగే ఎన్నికల్లో నియోజకవర్గంలోని 2220 మెడికల్ షాపుల వారు బీఆర్‌యస్‌పార్టీకి మద్దతు తెలిపారు.

బీఆఎస్‌లో చేరిన సాయికిరణ్ గౌడ్

మోతీనగర్: కొండ సాయికిరణ్‌గౌడ్ తన అనుచరులు అల్లాపూర్‌కు చెందిన 500 మందితో కలిసి శనివారం మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మాధవరం కృష్ణారావుకు అత్యధిక మెజార్టీతో విజయం చేకూర్చేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రజల కష్ట సుఖాలు తెలిసిన వాడిని..

కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తూ ప్రధాన పార్టీల అభ్యర్థులను 'సాక్షి'ప్రత్యేక ఇంటర్వ్యూ నిర్వహించింది. ఈ సందర్భంగా అధికార పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు 'సాక్షి'తో పంచుకున్న విషయాలు మీకోసం. – కూకట్‌పల్లి

ప్రశ్న: శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మీకు ప్రజలు ఎందుకు ఓటు వేయాలి?

జవాబు: ఇప్పటి వరకు నేను రెండు పర్యాయాలు విజయం సాధించాను. ఎన్నికల్లో పోటీ చేసే ముందు ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చాను. వేల కోట్లతో నిధులు తీసుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. ఇప్పటి వరకు వందల కోట్లతో మంచినీటి సరఫరాకు శ్రీకారం చుట్టి ప్రతి రోజు మంచినీరు సరఫరా అయ్యే విధంగా సమస్యను పరిష్కరించాను. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం నియోజకవర్గంలో 4 బ్రిడ్జిలను నిర్మించాను. నియోజకవర్గంలో 44 వేల మందికి ఇప్పటికే సంక్షేమ పథకాలు అందజేశాను. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులు కూడా వేలాది మందికి ఇప్పించాను. ప్రజల కష్ట సుఖాలను తెలిసిన వాడిని.. నాకు ఓటు వేస్తే భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కూకట్‌పల్లిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాను.

ప్రశ్న: మీకు ఓటు వేస్తే ప్రజలకు ఇంకా ఏమి చేయాలనుకుంటున్నారు?

జవాబు: ఇప్పటి వరకు నియోజకవర్గంలో 4వేల మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందజేశాం. మరో లక్ష డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో ఎక్కువ భాగం కూకట్‌పల్లి ప్రాంతంలో ఉన్న నిరుపేదలకు అందజేసే విధంగా కృషి చేస్తాను. అంతేకాకుండా ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు మరిన్ని నిధులు తీసుకువచ్చి అధునాతన రోడ్లతో ట్రాఫిక్ నియంత్రణకు నిపుణులతో సమీక్ష నిర్వహించి ట్రాఫిక్ ఫ్రీ ప్రాంతంగా కూకట్‌పల్లిని తీర్చిదిద్దటమే నా లక్ష్యం.

ప్రశ్న: నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు కాని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కాని మీ మనుషులకే వచ్చాయనే ఆరోపణలు ఉన్నాయి?

జవాబు: నియోజకవర్గంలో ఉన్న ప్రజలంతా నా మనుషులే. నియోజకవర్గానికి ఒక్కరే ఎమ్మెల్యే ఉంటారు.ఇద్దరు ముగ్గురు ఉండరు. అందుకోసం నియోజకవర్గంలో ఉన్న అందరికీ న్యాయం చేసే బాధ్యత నాపై ఉంది. నియోజకవర్గంలో ఇప్పటి వరకు ప్రతి సంక్షేమ పథక అమలులో పారదర్శకంగా ఉన్నాం. సమస్య ప్రాధాన్యతను బట్టి అభివృద్ధి చేశాం. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కూడా సాంకేతిక నైపుణ్యంతో అధికారుల సమక్షంలోనే ఆన్‌లైన్ ద్వారా ఇళ్లు కేటాయించాం. ఇళ్లు రాని వారు తాత్కాలికంగా బాధపడుతుండవచ్చు. కానీ అతి త్వరలో అందరికీ ఇళ్లు కేటాయించే విధంగా తెలంగాణ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో రూపకల్పన చేస్తోంది.

ప్రశ్న: ఈసారి ఎన్నికల్లో మీ విజయం ఎలా ఉంటుంది?

జవాబు: ప్రతిపక్షాలు ఎన్ని చాడీలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. తాను ఇప్పటి వరకు నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధి కోసం కోట్ల రూపాయలను తీసుకొచ్చాను. అదే విధంగా నియోజకవర్గంలో మారుమూల ప్రాంతంగా ఉన్న బస్తీలను కూడా కాలనీలుగా తీర్చిదిద్దాను. 40 సంవత్సరాలుగా మౌలిక సదుపాయాలు అందక దుర్భర జీవితంలో కూకట్‌పల్లిలో ఉన్న ఇందిరానగర్ ప్రాంతానికి రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశాను.

◆ ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంలో ఉన్న కొంతమంది పెద్ద నాయకులు తనపై తప్పుడు కేసులు బనాయించాలని ప్రయత్నించారు. అయినప్పటికి ప్రజల కోసం దేనికైనా సిద్ధం అన్నాను. ఈ విషయంలో తాను తెగించి కొట్లాడబట్టే పేద ప్రజలకు న్యాయం జరిగిందనడంలో నాకు సంతృప్తి ఉంది.

◆ అదే విధంగా కేంద్ర ప్రభుత్వంలో ఉన్న కొంతమంది మంత్రులు వ్యతిరేకించినప్పటికీ బాలానగర్‌లోని దిల్‌కుష్ ప్రాంత ప్రజలకు రహదారి కోసం మిలిటరీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టి వారికి న్యాయం చేశాను. ఈ విషయంలో ప్రజలతో కలిసి అర్ధరాత్రి వరకు అక్కడే ఉండి రోడ్డు నిర్మాణం చేపట్టడంతో ప్రజల్లో నాపై విశ్వాసం పెరిగింది.

ప్రశ్న: ఈసారి ఎన్నికల్లో ఇద్దరు బిల్డర్లు మీకు పోటీగా వస్తున్నారు. అర్థబలంతో ముందుకు వెళ్తే మీకేమైనా ఇబ్బంది ఉంటుందా?

జవాబు: కూకట్‌పల్లి ప్రాంతంలో ప్రజలు నమ్మేది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే వ్యక్తినే నమ్ముతారు. అర్థబలం, అంగబలం నమ్మే పరిస్థితిలో లేరు. మరీ ముఖ్యంగా నియోజకవర్గానికి సంబంధం లేని వారు ఇక్కడ పోటీ చేస్తున్నారు.

ప్రశ్న: రాష్ట్రంలో కాంగ్రెస్ హవా నడుస్తుందని ప్రచారం జరుగుతోంది? కాంగ్రెస్ హవాలో మీకేమైనా ఇబ్బంది ఉంటుందా?

జవాబు: కాంగ్రెస్ పార్టీలో పనిచేసి కష్టపడి జెండాలు మోసిన వారిని పక్కన పెట్టి రాత్రికి రాత్రి డబ్బులు కట్టి టిక్కెట్లు తెచ్చుకొని కూకట్‌పల్లికి సంబంధం లేని వ్యక్తులు ఇక్కడ పోటీ చేస్తే కాంగ్రెస్ పార్టీ వారే నమ్మటం లేదు. కాంగ్రెస్‌కుబద్ధ శత్రువుగా పనిచేసిన వ్యక్తి తన అర్థబలంతో టికెట్ కొనుగోలు చేసి ఇక్కడ పోటీ చేస్తే కూకట్‌పల్లి ప్రజలు అమాయకులు కారు.



మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్‌యస్ పార్టీలో చేరిన కేపీహెచ్‌బీకి చెందిన బీజేపీ నాయకులు



కృష్ణారావును సన్మానించి మద్దతు తెలుపుతున్న మెడికల్ షాప్ అసోసియేషన్ ప్రతినిధులు





ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నేడు విజయ సంకల్ప సభ

సభ ఏర్పాట్లను పరిశీలించిన బీజేపీ నేతలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో ఆదివారం నిర్వహించనున్న విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు తెలిపారు. ఈ సభకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగలు హాజరుకానున్నట్లు తెలిపారు. కూకట్‌పల్లి హుడా ట్రక్ పార్కు వేదికగా నిర్వహించన్నున ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లను మాధవరం కాంతారావు స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే అన్ని ఏర్పాటు పూర్తి అయ్యాయని అన్నారు. భారీ వేదికను సైతం సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఎవరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకుంటున్నామన్నారు.



విజయ సంకల్ప సభాస్థలి ప్రాంగణాన్ని పరిశీలించిన మాధవరం కాంతారావు

రక్తహీనత పరీక్షలు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూలులో శనివారం విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. భారత వికాస్ పరిషత్ కూకట్‌పల్లి శాఖ, మూసాపేట పీహెచ్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు అందరికీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులు, నువ్వుల లడ్డూలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ.. విద్యార్థుల్లో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉంటుందన్నారు. వాటిని గుర్తించి వెంటనే మందులు ఇవ్వాలన్నారు. ఎదిగే పిల్లలకు బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలని ఆమె సూచించారు.



పంచశీల స్కూల్‌లో రక్తహీనత పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

మోడీ నాయకత్వంలో దేశాభివృద్ధి

సమస్యలు పరిష్కరిస్తా..

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ రిలయన్స్ ఎమ్‌సిఆర్ ఆర్కేడ్ కమ్యూనిటి అసోసియేషన్ సమావేశంలో బీజేపీ అభ్యర్థి రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలిచిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీకి ఓటు వేసి మెజార్టీతో గెలిపించాలని కోరారు.

తులసీవనం గేటెడ్ కమ్యూనిటీలో..

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ తులసీవనం గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ సమావేశంలో రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. వారికి అండగా ఉంటానని తెలిపారు. ఎన్నికల్లో కమలం పువ్వుకు ఓటు వేయాలని కోరారు.

కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకోలేరు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌లో బీఆర్‌యస్ సీనియర్ నాయకుడు కూన సత్యంగౌడ్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కూన సత్యంగౌడ్ రాకతో హైదర్‌నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఎదగనుందని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్‌కు భారీ మెజార్టీయే లక్ష్యంగా ముందుకు సాగుతామని కూన సత్యం గౌడ్ తెలిపారు.

మార్పు కావాలి... కాంగ్రెస్ రావాలని

కూకట్‌పల్లి పార్టీ అభ్యర్థి బండి రమేష్



బాలాజీనగర్‌లో ప్రచారం చేస్తున్న బండి రమేష్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ శనివారం బాలాజీనగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా మార్పు కావాలి... కాంగ్రెస్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. తొమ్మిదేళ్ల క్రితం తెలంగాణ ఏర్పడటానికి దారితీసిన అతి ముఖ్యమైన కారణాలలో ఒకటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భాగమైన ఇతర ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధిని అందించాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి అంతా హైదరాబాద్‌లోనే కేంద్రీకృతమైందన్న భావన తెలంగాణగా మారిన జిల్లాల్లో బలంగా, విస్తృతంగా ఉండేదన్నారు.

◆ హైదరాబాద్ నగరంలో 1960 నాటికే ప్రభుత్వ పెట్టుబడులు భారీగా వచ్చాయన్నారు. 1980 చివరలో ప్రైవేట్ పెట్టుబడి వృద్ధిని ప్రేరేపించిందన్నారు. కొత్త రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి పెట్టుబడులు, ఉపాధిలో అత్యధిక పెరుగుదల హైదరాబాద్ చుట్టు పక్కల 2004–09లో కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డు అంచుకు మాత్రమే పరిమితమైందన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లు తెరపైకి రాకముందే హైదరాబాద్‌ను ఐటీ గమ్యస్థానంగా మార్చేందుకు పునాదులు పడ్డాయన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియమ్మ ఇచ్చిన మేనిఫెస్టో ద్వారా ప్రతి ఇంటికి గ్యారంటీ కార్డులు అందించామన్నారు.



◆ వాటిని ప్రజలు పూర్తిగా విశ్లేషించి నమ్మి కాంగ్రెస్‌కే మా ఓటు... బండి రమేషే మా ఎమ్మెల్యే అంటూ ప్రజలు ఉత్సాహంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా కారు పాయే, సర్కారు పాయే, గతి తప్పిన కేసీఆర్ మాటలు వినేవారు ఎవరు లేరన్నారు. కేటీఆర్‌ను ప్రజలు నమ్మటం లేదన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలను ఎవరూ కాపాడలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, ప్రెసిడెంట్ రాత్‌పుత్, లక్ష్మణ్, నర్సింహ, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఎన్నికల్లో గెలిచి

కొత్త ఒరవడిని సృష్టిస్తాం

కూకట్‌పల్లి జనసేన అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనసేన నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌తో 'సాక్షి'ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: కూకట్‌పల్లి నియోజకవర్గానికి సంబంధం లేని మీకు ఎందుకు ఓటు వేయాలి?

జవాబు: కూకట్‌పల్లి నియోజకవర్గంలో నేను రెండు దశాబ్దాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాను. నియోజకవర్గంలో ఎంతో మంది పేదలకు వైద్య సేవలతో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాను. తాను బిల్డర్‌గా ఇక్కడి ప్రాంతంలో సురపరిచితుడిని, లయన్స్ క్లబ్ ద్వారా హైదరాబాద్ నగరంలోనే నాకు ఎంతో ప్రాధాన్యత ఉంది. నియోజకవర్గంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి తాను రెండు నెలల పాటు నియోజకవర్గంలో పర్యటించాను. అనేక సమస్యలు నా దృష్టికి వచ్చాయి. అంతే కాకుండా నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుచరులు అక్రమాలకు పాల్పడుతూ దోచుకుంటున్నారని ప్రజలు నేరుగా చెప్పారు. అందుకోసం ప్రజలకు న్యాయం జరిగేందుకు నియోజకవర్గంలో ఉన్న సమస్యలను తీర్చేందుకు నేను కూడా ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎందుకు రాకూడదనే నిర్ణయానికి వచ్చి పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేసిన జనసేన పార్టీలో చేరి పోటీ చేస్తున్నాను.

ప్రశ్న: మీకు ఓటు వేస్తే ప్రజలకు ఏమి చేస్తారు?

జవాబు: ఇప్పటి వరకు దగా పడిన కూకట్‌పల్లి ప్రజలను రక్షిస్తాను. ట్రాఫిక్ సమస్య పట్ల తనకున్న అనుభవంతో ఈ నియోజకవర్గంలో ఉన్న ట్రాఫిక్ నియంత్రణ కోసం అన్ని శాఖల అధికారులతో పూర్తి స్థాయిలో చర్చించి నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తాను. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో జరిగిన అవినీతిని బయటకు తీసి నిజమైన లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందజేస్తాను. ఇంకా నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించి నియోజకవర్గాన్ని తెలంగాణలోనే ఐకాన్‌గా మారుస్తాను.

ప్రశ్న: కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీకి పట్టు లేదని ప్రచారం జరుగుతోంది? మీ మద్దతు పార్టీ బీజేపీ పూర్తిగా సహకరించటం లేదని విమర్శలు వస్తున్నాయి? దీనికి మీరేమంటారు.?

జవాబు: కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీకి అత్యంత జనాదరణ ఉంది. అందుకోసమే నేను ప్రచారం చేసే ప్రాంతాల్లో వేలాది మంది యువకులు, సామాన్య ప్రజలు మద్దతిస్తున్నారు. తనకు ప్రజలు నేరుగా వచ్చి సమస్యలు తెలియజేస్తున్నారు. జనసేన పార్టీ ఈ ఎన్నికల్లో విజయం సాధించి తెలంగాణలోనే ఓ కొత్త ఒరవడిని సృష్టించనుంది. బీజేపీ పార్టీ పూర్తి స్థాయిలో తనకోసం పనిచేస్తోంది. జనసేనతో కలిసి అడుగడుగునా అధికార పార్టీ ఆగడాలను అడ్డుకుంటూ బీజేపీ కూడా నాకు అండగా నిలబడుతోంది.

ఆనంద తాండవమాడే..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న సిద్ధేంద్రయోగి ఆరాధనోత్సవాలు రెండవరోజు ఘనంగా నిర్వహించారు. శనివారం డాక్టర్ శ్రీనివాస్ వరప్రసాద్ శిష్యబృందం ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. శివ తాండవం, నాగస్తుతి, అన్నమాచార్య కీర్తన, గరుడగమన, కుండపై నృత్యం, మూషికవాహన, బ్రహ్మమొక్కటే తదితర అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రముఖ కూచిపూడి నాట్యగురువు డాక్టర్ విజయ్‌పాల్ పత్లోత్ కళాకారులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు.